# నిప్పుల వాన



టి.ఎస్. హరగోపాల్

సన్నని తుంపర.

వేలాది పోలీసుల తుపాకుల గంధకపు బుసలని సవాలు చేస్తూ, గాలి నిండా వ్యాపించిన మట్టి వాసన

తాటి ఆకు మీద ధనధన మోగే డబ్బుల వర్షం

వర్షపు చప్పుడుకు భూమి కడుపులో మెసిలే విత్తనపు పసిగొంతు సవ్వడి.

కాలుని కాలమని అన్పించింది నాకు.

"శ్రీనూ, డ్రింక్స్ ఏమైనా పట్టుకొస్తావా, పుచ్చుకుందాం," అన్నా.

"మీరు.నన మీరు.. డ్రింక్స్ పుచ్చుకుంటూరా సర్" అని ఆశ్చర్యపోయాడు శ్రీను.

"ఏం తీసుకోకూడదా!"

"లేదు, తాగని పోలీసాఫీసర్లలో మీరొకరు అనుకున్నా"

జేబులో నుండి డబ్బు తీసిచ్చి, "నీకిష్టమైన బ్రాందు, చికెన్ కూడా పట్రా" అన్నా.

"మీరు నాన్‌వెజ్ తీసుకుంటారా! వద్దు సర్. మీరు నా పై ఆఫీసరు. అందులోనూ ఒక ఊరువాళ్లం."

"ఫర్వాలేదురా, ఒక ఊరు వాళ్ళం కాబట్టే... తే..."

శ్రీను బయటకు వెళ్తుంటే, సెల్‌లో ఒకడు "చూడరా, చట్టాన్ని కాపాడే వ్యక్తులే పోలీసు స్టేషనులో తప్పతాగుతున్నారు"అన్నాడు.

చట్టాన్ని కాపాడే వ్యక్తులు!

చట్టం... న్యాయం యిక్కడున్నాయి!

ఉంటే, ఇంద్రజ ఎందుకు ఆత్మహత్య చేసకుంటుంది!

శ్రీనివాసరావు... వాడ్ని కాల్చేయాలి...

చట్టాన్ని కాపాడే వ్యక్తే అన్యాయంగా ప్రవర్తిస్తే... వారి పుట్టినరోజు రాముడు పుట్టాడు.

కర్ణుడు పుట్టిన చోట కృష్ణుడు పుట్టాడు. ధర్మంగా సాధించలేనిది అధర్మంగానైనా సాధించాలి.

***

కాలేజీ శలవులు.

పిన్నివాళ్లింట్లో ఎవ్వరూ లేరు. వాకిట్లో కూర్చుని వున్నా. పిచ్చాపాటీగా హమ్మింగ్ చేస్తూ పాడుతున్నా.

నా హమ్మింగ్‌కి లయగా గజ్జెల శబ్దం.

యిక్కడ!

పాట నెమ్మది చేస్తూ విన్నా.

తడిక సందులోంచి, కాలిగజ్జెల శబ్దం.

అందమైన పాదాలు.

పాదాలకి వెండి గజ్జెలు.

ఎంత తెల్లగా వున్నాయి ఆ పాదాలు!

లేత తమలపాకుల్లాంటి ఆ పాదాలపైన నల్లని మచ్చ.

పాదాలు కూడా అంత అందంగా ఉంటాయని నాకప్పటివరకు తెలియదు.

పక్కవాటాలోనే మాస్టారు ఉండేది.

పాట ఆపి, "అక్కయ్య గారూ" అన్నా.

"లేదు" వెంటనే సమాధానం.

"ఎవరూ నువ్వా ఇంద్రజా!"

"అవును"

నాలో శాటర్న్ ప్రవేశించాడు.

మంచికీ, చెడుకీ మధ్య క్షణమది.

నా మీద నేను అదుపు కోల్పోయిన బలహీన క్షణం.

నెమ్మదిగా లేచి వెళ్లా.

ముగ్ధ మోహనరూపం.

"నువ్వేనా యిప్పటి వరకు తాళం వేస్తున్నదే!"

ఒక్కమారుగా ఇంద్రజ మంచం మీద నుంచి లేచింది.

"నేనే... పాట బాగుందిని"

"పాట కాదు, నీ పాదాలు... నీ పాదాలు... యింత బాగుంటాయని యీ రోజే చూశా. యింత గుడ్డివాడినో.. " ఆమె పాదాలు ఒక్కమారుగా

# కథానిక

ముద్దు పెట్టుకున్నా..

"ఛీ, ఛీ... ఏమిటిది" కాళ్లు వెనక్కు లాక్కుంది.

"అవును, ఇంద్రజా! లేటుగా తెలుసుకున్నా నిజం, నేను నిన్ను ప్రేమిస్తున్నానని" ఆమె భుజాల మీద చేయివేసి, పొదివి పట్టుకున్నా.

"రవీ, వదులు... వదలమంటుంటే... నేను నిన్నెప్పుడూ అలా చూడలేదు... నువ్వు మా అన్నయ్యలాంటి వాడివి.. చచ్చిపోయిన మా అన్నయ్య గుర్తొస్తాడు నిన్ను చూస్తుంటే..."

ఒక్కమారుగా ఆమెని వదిలా.

"నువ్వు చాలా మంచివాడివనుకున్నా. నువ్వు కూడా"

నాలోని శాటర్స్ పారిపోయాడు.

ఒక్కమారుగా విజృంభించిన చెడు చచ్చిపోయింది.

"లేదు, లేదు, సారీ" గిరుక్కున వెనక్కు తిరిగా.

చరిత్రలో కలిసిపోయిన సత్యమిది. ఈ రోజు ఇంద్రజ చనిపోకుండా ఉంటే, నాకూ గుర్తుకొచ్చేది కాదు.

గుర్తు చేసుకోటానికి కూడా నన్ను నేను అసహ్యించుకునే సంఘటన అది.

ఇంద్రజ పెళ్లయింది.

శుభలేఖ వచ్చింది గానీ, ముఖం చెల్లక, గ్రీటింగ్స్ పంపి ఊరుకున్నా.

తర్వాత ఊరు వెళ్తే, తెలిసింది, ఇంద్రజ ఆత్మహత్య చేసుకుందని.

"హైద్రాబాద్‌లోనే కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు రోజూ భర్తలేని టైంలో, వాళ్లింటికి వెళ్లి, పాత స్నేహాన్ని గుర్తు చేసి, తనతో సంబంధం కొనసాగించమని వేధించాడట. ఆవేదన భరించలేక, యిప్పుడు భర్త దగ్గర అల్లరవుతుందోనని ఇంద్రజ ఆత్మహత్య చేసుకుంది" భాస్కరం చెప్పిన కొత్త నిజాన్ని జీర్ణం చేసుకోలేకపోయా.

వృత్తిరీత్యా అన్యాయాన్ని సహించలేని నేను ఇంద్రజ ఆత్మహత్యని తేలిగ్గా తీసుకోలేకపోయా.

***

ఆ పాపాత్ముడి చరమాంకానికి రంగస్థలంగా ఎన్నుకున్న ప్రదేశం. 'ధర్మారం'.. తెలంగాణాలో పక్కా పల్లెటూరు.

నక్సలైట్స్ పేరిట పట్టుకొచ్చి, సెల్‌లో వేసి కొడ్తుంటే, నాకే ఒళ్లు గగుర్పొడిచేది. మరీ ఎదురు తిరిగితే ఎన్‌కౌంటర్ పేరిట కాల్చేయటమే.

కాని, నాకు ఆ ఊరు 'ధర్మక్షేత్రం'

నెల రోజులకి శ్రీనివాసరావుకి కూడా ధర్మారం ట్రాన్స్‌ఫర్ అయింది.

***

శ్రీను విస్కీ, సోడా, చికెన్, పకోడీ తెచ్చాడు. గ్లాసులో పోశా.

మొహమాట పడ్డాడు.

"ఫర్వాలేదురా, చిన్నప్పటి ఫ్రండ్స్ పో," అన్నా.

ధైర్యం చేశాడు.

"మీరూ తీసుకోండి సర్" అన్నాడు.

"నేను ముందు రెండు సోడాలు తాగాలి, అప్పుడు గానీ కిక్ ఇవ్వదు"

"భలే వింత అలవాటు సర్"

నవ్వి ఊరుకున్నా.

శ్రీనుకి ఫుల్‌గా కిక్ ఎక్కింది.

చికెన్ కూడా లాగించేశాడు.

ఏవేవో కబుర్లు చెబ్తున్నాడు.

సడన్‌గా నేను, "అవును శ్రీనూ, ఇంద్రజని పెళ్లి చేసుకుందా మనుకున్నావుగా చేసుకోలేదే" అన్నా.

ఒక్కమారుగా ఉలిక్కిపడ్డాడు.

"నేనెప్పుడు చెప్పా మీతో..!"

"చెప్పావులే"

"ఛ, దానిని పెళ్లి చేసుకుందామని ఎవడనుకున్నాడు సర్, నాలుగు కబుర్లు చెబ్తే, ప్రేమించాననుకుంది"

నా రక్తం ఉడుకెక్కింది.

"హైద్రాబాద్‌లో ఎప్పుడూ కలవలేదా!"

"కలిశా సర్... సరదాగా ఎంజాయ్ చేద్దామంటే, కాదంది పిచ్చిముండ. అనవసరంగా అన్యాయమయిపోయింది."

చాచి, ఒక్క తన్ను తన్నా.

ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి సర్ తంతారు!"

"గురుల్లిద్దరూ అమ్మాయిల కబుర్లలో పడి, కొట్టుకుంటున్నార్రా" సెల్‌లో ఒకడు.

"షటప్" అని అరిచా వాడిమీద.

"ఏరా, ఇంద్రజ పిచ్చిముండా! సరదాగా ఎంజాయ్ చేద్దామనుకున్నావా! నాలుగు కబుర్లు చెబ్తే ప్రేమించావనుకుందా! అన్యాయమయిపోయింది గదూ! నువ్వూ అన్యాయమయి పోతావురా" రివాల్వర్‌ని వాడి గుండెలకి గురి చూసి, కాల్చా.

హాహాకారాలు చేసుకుంటూ, వాడు నేల కొరిగాడు.

సెల్‌లో ఇద్దరు నక్సలైట్లు, "హత్య... అన్యాయం..." అని అరవటం మొదలు పెట్టారు.

"వీడు తనని ప్రేమించిన అమ్మాయి కాపురంలో చిచ్చు పెట్టిన మనిషి. సుఖంగా కాపురం చేసుకుంటున్న ఆ అమ్మాయి ఆత్మహత్యకు కారకుడు. కానీ వీడు చట్టానికి దొరకడు. అలా చట్టానికి దొరకుండా, అన్యాయాలు చేసేవాళ్లని, ఆడపడుచుల మాన, ప్రాణాలతో ఆడుకునే వాళ్లని, మీ 'అన్న'లు ఏం చేస్తారు?"

"ఎ.కె. 56 రైఫిల్‌తో కాల్చేస్తాం"

"ఇప్పుడు కూడా మీరే కాల్చేశారు వాణ్ని"

"మేమా!" ఆశ్చర్యపోయారు వాళ్లు.

"అవును, మీరే... వాణ్ని కాల్చి, యీ పిస్టల్‌తో పారిపోయారు. వాడు లాగి, మైకంలో సెల్ తలుపులు తెరిస్తే, మీరు వాణ్ని కాల్చేశారు. నేనిక్కడ లేను. నేను రాసే రిపోర్టదే"

"ఇంత పచ్చి అబద్ధమా!"

"అవును. నిజాన్ని చంపేయకపోతే, న్యాయం జయించదు. ఇలాంటి నీచులకి అంతం ఉండదు. ఏమిటాలోచిస్తున్నారు? విప్లవం అంటే కేవలం పీడిత వర్గ రాజ్యాధికోసం జరిగే పోరాటం కాదు. సమాజంలో సకల రంగాలలో జరగవలసిన మార్పు. స్త్రీ ఎక్కడ గౌరవించబడ్తుందో అక్కడ ప్రగతి ఉంటుంది. ఇలాంటి కామాంధులు ఎక్కడ ఉన్నా, వాళ్లని కాల్చేయాలి. కాదంటారా!"

వాళ్ల కళ్లల్లో మెరుపు

సెల్ తలుపులు తెరచి, పిస్టల్ వాళ్ల చేతికిచ్చా.

'నిప్పుల వాన' వెలిసింది.

